సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



దేవుడి బంగారం భద్రమేనా?

జోగుళాంబ అమ్మవారి బంగారు ఆభరణాల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

వివరాలు 10లో ▸



సరిహద్దులో పటిష్ట నిఘా

రాష్ట్ర సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తామని డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.9 /22.3

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవన్‌లో ఈ నెల 11న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతాకుమారి అధ్యక్షతన జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఉషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 2, 3, 4, 5వ స్థాయి సంఘాలు, మధ్యాహ్నం 6, 7, 1వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులతో పాటు జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు.

వలసల జిల్లా కాదు.. ఐటీ పాలమూరు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఒకప్పుడు వలసల జిల్లా.. ఇప్పుడు ఐటీ పాలమూరు గా మారిందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని దివిటిపల్లి ఐటీ టవర్‌లో జువెన్ టెక్నాలజీస్ ఐఎన్‌సీ (అమెరికా-డల్లాస్), అర్బన్ టెక్ (కాలిఫోర్నియా) కంపెనీలను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలమూరు ఐటీ పట్టణానికి మరో మణిహారమని అన్నారు. 400 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఈ టవర్ యువతకు బంగారు భవిష్యత్ అని, వారి అభ్యున్నతికి బాటలు వేస్తుందన్నారు. ఇక్కడే దేశంలోనే పెద్దదైన సెల్ కంపెనీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈనెల 16న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి సీఎం కేసీఆర్ నీటిని విడుదల చేస్తారన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా సస్యశ్యామలం కానుందని, దీంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తామన్నారు. ఇకపై జిల్లా యువత బతుకుదెరువు కోసం ఎక్కడికి వలస వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జువెన్ టెక్ అధినేత, జిల్లాకు చెందిన బిడ్డ ఉమాకాంత్, కంపెనీ ప్రతినిధి ప్రవీణ్ ముందుకు వచ్చి వంద మంది ఉద్యోగులతో, అలాగే అర్బన్ టెక్ ద్వారా 50 మందికిపైగా ఇక్కడి నుంచి కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక అమరరాజా కంపెనీకి చెందిన లిథియం గిగా పరిశ్రమ ద్వారా భవిష్యత్‌లో 11 వేల మంది స్థానికులు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ ఎంపీపీ అనిత, దివిటిపల్లి సర్పంచ్ జరీనాబేగం, కౌన్సిలర్ తోకల యాదమ్మ పాల్గొన్నారు.

రేపు సాహితీ పురస్కారాల ప్రదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాకవి కాళోజీ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ పాకాల యశోదారెడ్డి జయంతి ఉత్సవాల సందర్భంగా సాహితీవేత్తలకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్

రాజకీయాస్త్రం.. పాలమూరు



16న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రాజెక్ట్ ప్రారంభానికి సన్నాహాలు

- పండగలా నిర్వహణకు బీఆర్‌ఎస్ సన్నద్ధం
- పూర్తి కాకముందే ఎలా ప్రారంభిస్తారని కాంగ్రెస్ నేతల విమర్శలు
- నేడు నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్ల సందర్శనకు శ్రీకారం
- ఎన్నికల షెడ్యూల్ రాకముందే హీటెక్కిన జిల్లా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలో 12.30లక్షల ఎకరాలను సస్యశామలం చేయడంతో పాటు తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ మరోసారి రాజకీయాస్త్రంగా మారింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ భారీ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్‌పై గత ఎన్నికల సమయంలో, ఆ తర్వాత సైతం అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాపై బీజేపీ, బీఆర్‌ఎస్.. ఇచ్చిన హామీ మేరకు గడువులోగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయలేదని కాంగ్రెస్.. ఇందుకు అడ్డంకులు సృష్టిస్తూ కోర్టులకెక్కింది మీరే కాదా అంటూ గులాబీ పార్టీల పరస్పర విమర్శలతో దూషణలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఎట్టకేలకు ఈ నెల 16న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించుకోవాలని గులాబీ బాస్ పిలుపునివ్వగా.. ప్రాజెక్ట్ పూర్తి చేయకముందే ప్రారంభోత్సవమా అంటూ కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా రిజర్వాయర్ల సందర్శనకు తెర లేపడం పొలిటికల్ వార్‌కు సంకేతాలుగా నిలుస్తున్నాయి. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారగా.. ఎన్నికల షెడ్యూల్ రాకముందే జిల్లా రాజకీయాలు వేడెక్కాయి.

నేడు కాంగ్రెస్ రిజర్వాయర్ల సందర్శన..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా.. ప్రారంభోత్సవాల పేరుతో పండుగలు చేయడమేంటని ప్రశ్నిస్తూ.. ప్రాజెక్ట్ వాస్తవ స్థితిగతులను పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రాజెక్ట్ బాటకు సిద్ధమైంది. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు శనివారం నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను సందర్శించేందుకు సమాయత్తమయ్యారు. ఇప్పటివరకు ప్రాజెక్ట్ కింద రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణంతో పాటు కొన్ని చోట్ల భూసేకరణ కూడా ఇంకా పూర్తికాలేదని వారు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ నేతలు ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు పెద్దగా స్పందించలేదు. త్వరలో వారు సైతం పోటాపోటీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం.

అధికార పార్టీ మరింత దూకుడుగా..

ఈ నెల 16న నార్లాపూర్ పంప్‌హౌస్‌లోని ఇన్‌టేక్ వద్ద మొదటి మోటారు స్విచ్ ఆన్ చేసి నీటి పంపింగ్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. కృష్ణమ్మకు ప్రత్యేక పూజల అనంతరం నార్లాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా వైభవంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున సభకు హాజరయ్యేలా ఆ పార్టీ నాయకులు సన్నాహాలు మొదలుపెట్టారు. ప్రాజెక్ట్ ప్రారంభించిన మరుసటి రోజు 17న దక్షిణ తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలు ఆలయాల్లోని దేవతామూర్తులను కృష్ణా జలాలతో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకోవాలని కేసీఆర్ సూచించారు. అధికార బీఆర్‌ఎస్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు మొదలయ్యాయి. ప్రాజెక్ట్ నిర్మాణంలో జాప్యం, ప్రారంభోత్సవంపై కాంగ్రెస్ ఇప్పటికే విమర్శలు గుప్పిస్తుండగా.. తిప్పికొట్టేలా బీఆర్‌ఎస్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు గులాబీ నేతలు మరింతగా దూకుడుగా వ్యవహరించనున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

కందనూలు: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందని, అందులో భాగంగా దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థానాలను, ఖాళీల జాబితాలో ప్రకటించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు తెలియజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2008 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఈ నెల 3 నుంచి వచ్చే నెల 3వ తేదీ లోపు బదిలీ ప్రకియ పూర్తిచేసేలా షెడ్యూల్ వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల మూడు నుంచి 5వ తేదీ వరకు గడువు ఇచ్చారని, మూడు రోజులు పాటు అన్‌లైన్ చేసుకున్న ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తు హార్డ్ కాపీలను పరిశీలించి జాబితా రూపొందించారని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సీనియార్టీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో, గజిటెడ్ హెచ్‌ఎంలకు సంబంధించి ఆర్‌జేడీ వెబ్‌సెట్‌లో పొందుపరిచి, ఉపాధ్యాయులందరూ చూసుకునేలా డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు.

జాబితాపై అభ్యంతరాలు..

10, 11 తేదీల్లో జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని, 12న ఫైనల్ జాబితా అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం గజిటెడ్ హెచ్‌ఎంల, స్కూల్ అసిస్టెంట్ల, ఎస్జీటీల బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఒకే ఉన్నత పాఠశాలలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన గజిటెడ్ హెచ్‌ఎంలు, ఒకే పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా, సీనియార్టీ జాబితా తయారు చేసి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు అవకాశం ఇస్తామని, ఆ తర్వాత సీనియార్టీ జాబితా తయారు చేసి పారదర్శకంగా బదిలీలు, పద్నోతుల ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

లింగోజీరావు ఆశయాలను కొనసాగిస్తాం: సీపీఎం



నాగర్‌కర్నూల్ రూరల్: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు లింగోజీ రావు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం లింగోజీ రావు 10వ వర్ధంతిని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో ఈ ప్రాంతంలో పోరాడారని, నాయకులకు కొరియర్‌గా పని చేశారని తెలిపారు. సీపీఎం నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషిచేశారని, అనేక రాజకీయ అవకాశాలు వచ్చినా.. చివరి వరకు సీపీఎంలోనే కొనసాగారని పేర్కొన్నారు. ఆర్.శ్రీనివాసులు, కంది కొండ గీత, యాదయ్య, అశోక్, సత్యనారాయణ, శ్రీనివాస్, శివరాం పాల్గొన్నారు.

586 పోస్టులతో టీఆర్టీ



మహబూబ్‌నగర్‌లోని లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

ఐదేళ్ల తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

- ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఏ 232, ఎస్‌జీటీ 241 పోస్టులు మాత్రమే భర్తీకి అవకాశం
- ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్న బోర్డు
- తక్కువ పోస్టుల కేటాయింపుపై నిరుద్యోగుల అసంతృప్తి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నిరుద్యోగులు ఎదురుచూస్తున్న టీఆర్టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్)కు ప్రభుత్వం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. చివరిసారి 2018లో టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం ఇప్పుడు నేరుగా విద్యాశాఖ ఆధ్వర్యంలోనే చేపట్టనుంది. ఇందులో భాగంగా టీఆర్టీ కంటే ముందే టెట్ నిర్వహించాలని భావించిన ప్రభుత్వం జూన్‌లో దరఖాస్తులు సైతం స్వీకరించగా.. ఈ నెల 15న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. ఈ క్రమంలో టీఆర్టీ కోసం దరఖాస్తు తేదీ నుంచి కేవలం 60 రోజుల్లో అంటే నవంబర్ 20 నుంచి అదే నెల 30వ తేదీ మధ్యలో పరీక్షలు సైతం నిర్వహించనున్నారు. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 2 వేలకుపైగా పోస్టులు ఖాళీ ఉండగా.. 586 పోస్టుల భర్తీకి అవకాశం కల్పించడం ఏమిటని నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సబ్జెక్టు, కేటగిరీల వారీగా చూసినా చాలా తక్కువ ఉంటాయని, అభ్యర్థులు పెద్దసంఖ్యలో ఉన్నారని పేర్కొంటున్నారు. పోస్టులు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో టెట్‌కు రెండు పేపర్లు కలిపి దరఖాస్తు చేసుకున్న వారు 80 వేలకు పైగా ఉండటంతో ఒక్కో పోస్టుకు 140- 150 మంది పోటీపడే అవకాశం ఉంది.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

టీఆర్టీ అభ్యర్థులు సబ్జెక్టుల వారీగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఒక్కో సబ్జెక్టుకు దరఖాస్తు చేసుకునేవారు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థుల కనీస వయస్సు 18- 44 మధ్య ఉండాలి. తెలంగాణ ప్రభుత్వ రెగ్యులర్ సర్వీస్ వారికి ఐదేళ్లు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్‌కు మూడేళ్ల మినహాయింపు ఉంటుంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా ఆఫ్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించగా.. ఈసారి నేరుగా ఆన్‌లైన్‌లోనే కంప్యూటర్ బేస్డ్ పరీక్ష 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు బోర్డు పేర్కొంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లా పరిధిలోని మహబూబ్‌నగర్‌లో 415 పోస్టులు, నాగర్‌కర్నూల్‌లో 450, నారాయణపేటలో 470, గద్వాల, వనపర్తిలో కలిపి 316 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వీటిలో 30 శాతం పోస్టులు పదోన్నతులకు కేటాయించినా దాదాపు 1,400 పోస్టులు నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రభుత్వమే తక్కువ పోస్టులు భర్తీ చేస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు. చాలామంది గతేడాది నుంచి టీఆర్టీ కోసం ఎదురుచూస్తున్నారు. మధ్యలో గురుకుల పోస్టులు పడినప్పటికీ అందులో దాదాపు 80 శాతం కేవలం మహిళలకే కేటాయించడంతో పురుష అభ్యర్థులు ఆశలన్నీ టీఆర్టీ మీదనే పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఎన్ని పోస్టులకు పదోన్నతులు కల్పిస్తున్నారనే అంశంపై ప్రభుత్వానికి స్పష్టత ఉండగా.. మిగిలిన పోస్టులను పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాల వారీగా ఖాళీల వివరాలు..

జిల్లా	స్కూల్ అసిస్టెంట్లు	భాషా పండితులు	వ్యా. ఉ	సెకండ్ గ్రేడ్ టీచర్లు	మొత్తం
మహబూబ్‌నగర్	23	19	7	47	96
జోగుళాంబ గద్వాల	34	27	8	77	146
నాగర్‌కర్నూల్	61	15	2	36	114
నారాయణపేట	71	20	1	62	154
వనపర్తి	43	9	5	19	76
మొత్తం	232	90	23	241	586

వ్యాయామ ఉపాధ్యాయులు

ఇన్నిరోజుల నిరీక్షణతో అసంతృప్తి



ఏడాది కాలంగా టీఆర్టీ పడుతుందని పరీక్షలకు సిద్ధమవుతున్నాం. ఈ క్రమంలో మధ్యలో గురుకుల నోటిఫికేషన్ వచ్చినా.. 80 శాతం పోస్టులు మహిళలకే ఉన్నాయి. ఈ టీఆర్టీలో అయినా ఎక్కువ పోస్టులు ఉంటాయని భావించాం. కానీ ఫలితం లేకుండా నేరుగా నోటిఫికేషన్ ఇచ్చారు. సబ్జెక్టు, రిజర్వేషన్ ఆధారంగా ఒక్కో పోస్టులకు వందల సంఖ్యలో పోటీ ఉంటుంది.

– చిన్నరాజు, టీఆర్టీ అభ్యర్థి, లక్ష్మిపల్లి

పట్టించుకోకపోవడం దారుణం



ప్రభుత్వం చాలీచాలని పోస్టులు వేయడం వల్ల టీఆర్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. గతేడాది అసెంబ్లీలో ప్రకటించిన పోస్టులను నమ్ముకుని టీఆర్టీకే సిద్ధమవుతన్నాం. కేడర్ వారిగా తీసుకుంటే జిల్లాలు, రోస్టర్ పద్ధతిలో బీసీలకు చాలా తక్కువ పోస్టులు వస్తాయి. పోస్టులు పెంచాలని విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోకుండా నోటిఫికేషన్ ఇవ్వడం దారుణం.

– కేశవులు, టీఆర్టీ అభ్యర్థి, నిజాలాపూర్

క్రీడలు షురూ..

- వినియోగంలోకి రానున్న క్రీడా ప్రాంగణాలు
- మండల కేంద్రాలకు చేరుకున్న క్రీడా సామగ్రి
- గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగం

అచ్చంపేట: గ్రామాల్లోని యువత, విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. క్రీడలపై ఆసక్తి పెంచడం, ప్రతిభావంతులను ప్రోత్సహించడం కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఎట్టకేలకు వినియోగంలోకి రానున్నాయి. ప్రతి పల్లెలోనూ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా.. ఆటలు ఆడేందుకు క్రీడా సామగ్రి లేకపోవడంతో గతేడాదిగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి క్రీడా ప్రాంగణానికి ప్రభుత్వం క్రీడా సామగ్రిని కేటాయించింది. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు త్వరలోనే పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలు ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు చేరుకున్నాయి. గ్రామాల వారీగా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అందుబాటులోకి క్రీడా సామగ్రి..

స్పోర్ట్స్ కిట్ల కారణంగా ప్రాంగణాలు వినియోగంలోకి వస్తే ఆరోగ్యం, వినోదం లభించనుంది. క్రికెట్‌కు సంబంధించి బాల్స్, ప్యాడ్స్, వికెట్స్, బ్యాట్స్, గాడ్, గ్లౌజులు, కీపింగ్ లెదర్ గ్లౌజులు, లెగ్‌ప్యాడ్లు, హ్యాండ్ ప్యాడ్లు, ఒక క్రికెట్ కిట్‌బ్యాగ్‌లో 12 రకాల సామగ్రితో పాటు వాలీబాల్‌కు సంబంధించి నెట్‌బాల్స్, పుట్‌పంపు, టేప్ తదితర వస్తువులు కిట్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే యువతకు శారీరక వ్యాయామం కోసం 30 కిలోల మూడు సెట్ల డంబెల్స్, 1, 2 కిలోల డిస్కస్‌త్రో, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్, 3 విజిల్స్, స్టాప్‌వాచ్, క్రీడాకారులకు టీషర్టులు ఉన్నాయి.

క్రీడా ప్రాంగణాల ఏర్పాటు లక్ష్యం 662

ఏర్పాటు చేసినవి 459

వినియోగంలో ప్రాంగణాలు..

క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామాలతో పాటు మున్సిపాలిటీల్లోని ప్రధాన వార్డుల్లో క్రీడాప్రాంగణాలను గతేడాది ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామపంచాయతీల్లో స్థలాల లభ్యతను బట్టి కొన్ని గ్రామాల్లో పాఠశాలల్లో, ఊరికి దగ్గరగా ఏర్పాటు చేయగా.. స్థలాలు అందుబాటులో లేని చోట గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. సౌకర్యాల కల్పనకు ఉపాధిహామీ పథకం కింద రూ.2 లక్షలకు పైగా నిధులు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 461 గ్రామపంచాయతీల పరిధిలో 662 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 459 గ్రామపంచాయతీల్లో స్థలాలు గుర్తించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అచ్చంపేట మండలం మర్లపాడుతండా, దేవులతండా జీపీలు నక్కలగండి ప్రాజెక్టుల్లో ముంపునకు గురవుతుండటంతో ఈ రెండింటిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. మిగిలినా 203 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించాల్సి ఉంది. నాలుగు మున్సిపాలిటీల పరిధలో 86 వార్డుల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతి మున్సిపాలిటీల్లో ఒకటి, రెండు మినహా కళాశాలలు, పాఠశాలలు, ఖాళీ స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మైదానాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఇతర వ్యాయామాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా.. క్రీడాప్రాంగణాలు వినియోగంలో ఉన్నాయి. దీంతో ప్రభుత్వం జిల్లాకు.. స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది.



ఉప్పునుంతల మండల పరిషత్ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లు

త్వరగా అందించాలి..



ప్రతి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణాల్లో వసతులు లేవని ఆటలకు దూరమవుతున్న సమయంలో క్రీడా సామగ్రి అందుబాటులోకి వచ్చింది. ఇక యువత రోజూ సాధన చేయొచ్చు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం మెరుగుపడుతుంది. క్రీడా సామగ్రి త్వరగా అందించాలి.

– ఎం.బాలరాజు, క్రీడాకారుడు, ఉప్పునుంతల

ప్రతిరోజూ సాధన



క్రీడా ప్రాంగణాల్లో ఆట వస్తువులు లేక సాధన చేయలేకపోతున్నాం. స్పోర్ట్స్ కిట్లు వచ్చిన నేపథ్యంలో ప్రతిరోజూ సాధన చేస్తూ.. ఆటలు ఆడుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు ఉన్నా.. వెలుగులోకి రావడం లేదు. క్రీడాకారులకు కిట్లు ఎంతగానో ఉపయోగపడుతాయి. టీషర్టులు కూడా అందించడం ఆనందంగా ఉంది.

– కలీం, క్రికెట్ క్రీడాకారుడు, అమ్రాబాద్

'రైతును రాజును చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కింది'



గుంతకోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: రైతును రాజును చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని, గతంలో ఎన్నో గోసలు పడ్డామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. 'పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రి' పాదయాత్రంలో భాగంగా శుక్రవారం మండలంలోని మేడిపూర్ నుంచి గుంతకోడూరు, యాదిరెడ్డిపల్లి, తాడూరులో పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకులు ప్రజల సంక్షేమంపై నిర్లక్ష్యం వహించినందున కుటుంబాలు వదిలేసి వలస వెళ్లారని, కరెంట్ అడిగితే కాల్చి చంపారన్నారు. గతంలో నీళ్ల లేక పొలాలు బీడ్లుగా మారాయన్నారు. ప్రస్తుతం వందల కిలోమీటర్ల దూరాన ఉన్న శ్రీశైలం నుంచి కాల్వల ద్వార నీటిని తెచ్చి రైతులు రెండు పంటలు పండించుకునేలా కేసీఆర్ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పంట వేసింది మొదలు కొనేవరకు రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నియోజకవర్గంలో కేఎల్ఐ కాల్వల ద్వారా 80 శాతం సాగునీరు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్‌యాదవ్, జెక్కరఘునందన్ రెడ్డి, వసంత, రమేష్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వివాహిత బలవన్మరణం


నందిని(ఫైల్)

అచ్చంపేట రూరల్: మనస్తాపం చెంది ఓ వివాహిత పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలోని గుంపన్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాత్లావత్ భాస్కర్‌కు లింగాల మండలం ఎంసీతండాకు చెందిన నందిని(18)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. కొన్ని రోజుల పాటు అన్యోన్యంగా ఉన్న దంపతులు రెండు రోజులుగా చిన్నపాటి గొడవ అయ్యిందని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నందిని పురుగు మందు తాగింది. అపస్మారకస్థితిలో ఉండగా ఇరుగుపొరుగు వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అచ్చంపేట ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైల్వే ఉద్యోగి హఠాన్మరణం

పెబ్బేరు రూరల్: రైల్వే ఉద్యోగి హఠాన్మరణం చెందిన ఘటన వనపర్తి మండలంలోని నాగవరం శివారులోని జంగిడిపురం కాలనీలో చోటు చేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం నవీన్(37) మదనాపురం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన నాగర్‌కర్నూల్ జిల్లా , కొల్లాపూర్ కుడికిల్లకు చెందినవాడు. వనపర్తిలో నివాసం ఉంటూ రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంభ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలో పంచాయతీ రాజ్‌శాఖ రాష్ట్ర పరిశీలకులు అరవింద్ శుక్రవారం పర్యటించి పలు ప్రభుత్వ కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గోబర్ ప్లాంట్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కరుణశ్రీతో కలిసి పరిశీలించారు. ప్లాస్టిక్ గోదాం పరిశీలించి ప్లాస్టిక్ సేకరణ ప్రక్రియను, దానికి అయ్యే ఖర్చును అడిగి తెలుసుకున్నారు. అంతేకాక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు అందుతున్న భోజనం, వారి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ బ్రహ్మాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని మరికుంట సమీపంలో లక్ష్మీనర్సింహ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన తిరుపతి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులను ధ్వంసం చేసి చోరీకి పాల్పడారు. ఎంత నష్టం వాటిల్లిందో యజమాని వస్తే తప్పా తెలియదు. శుక్రవారం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. ఫిర్యాదు మేరకు వివరాలు తెలుస్తాయని ఎస్ఐ నాగన్న చెప్పారు.

చిన్నోనిపల్లె నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గట్టు: కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను 16ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టి రైతులను ప్రభుత్వం మోసం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్వ విజయ్‌కుమార్, వీరాబాబు, రాజీవ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నోనిపల్లె గ్రామాన్ని సందర్శించారు. చిన్నోనిపల్లె గ్రామంతోపాటుగా రిజర్వాయర్ కట్టను పరిశీలించారు. అనంతరం చిన్నోనిపల్లె భూనిర్వాసితులకు న్యాయం చేయాలంటూ రిజర్వాయర్ కట్ట వద్ద ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, అక్కడి బలవంతంగా బయటకు పంపారు. అంతకు ముందు చిన్నోనిపల్లె గ్రామస్తులతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం చిన్నోనిపల్లె ముంపు నిర్వాసితులకు ఎకరాకు రూ.25లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పునరావాస కేంద్రంలో మౌలిక వసతులను కల్పించి, నిర్వాసితులకు డబుల్ బెడ్ రూంలను మంజూరు చేయాలన్నారు. పునరావాసంలోకి మారేందుకు షిఫ్టింగ్ చార్జీలు రూ.7లక్షలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్లకు అధిక ముడుపులు చెల్లించి, రైతులను నట్టేట ముంచినట్లు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అసైన్డ్ భూములకు పట్టాలను సృష్టించి రూ.లక్షలను దోచుకున్నారని, అసైన్డ్ భూ అక్రమ దందాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరబాబు, రాజీవ్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దేవుడి బంగారం భద్రమేనా?

- లెక్కలు అడిగితే కాలయాపన చేస్తున్న అధికారులు
- సస్పెండ్ గురైన ఉద్యోగి ఆధీనంలోనే రికార్డులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలకు చెందిన బంగారు ఆభరణాలపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. 20 రోజుల క్రితం సస్పెండ్ అయిన సీనియర్ అసిస్టెంట్ తన ఆధీనంలోని బంగారు ఆభరణాలు, రికార్డులు దేవస్థానంకు అప్పజెప్పలేదు. సస్పెండ్ అయిన వెంటనే రికార్డులను ఆలయ అధికారులు స్వాధీనం చేసుకోకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.


అలంపూర్ ఆలయాలు

లెక్క తేలని ఆభరణాలు

దేవదాయశాఖ నిబంధనల ప్రకారం దేవుడి బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచడమే కాక వాటికి ఇన్సూరెన్స్ చేయించాలి. అయితే అలంపూర్ ఆలయంలోనే నేటి దాక ఆభరణాలకు ఇన్సూరెన్స్ చేయకపోగా వాటిని ఆలయంలోని లాకర్‌లో భద్రపరుస్తున్నారు. అమ్మవారికి నిత్యంతో పాటు విశేష రోజులలో అలంకరించే ఆభరణాలను లాకర్‌లోనే భద్రపరచకుండా ఆలయంలోనే ఉంచుతున్నారు. పూర్వం నుంచి వచ్చిన బంగారు, వెండి ఆభరణాలతో పాటుగా హుండీ లెక్కింపులో వస్తున్న మిశ్రమ బంగారు, వెండి నేటి వరకు ఎంత జమైంది? నిరుపయోగంలోని బంగారు ఆభరణాలు ఎన్ని? ఇలా అనేక అనుమానాలకు సమాధానం తెలియాల్సి ఉంది.

స్వాధీనం చేసుకునేందుకు వెనకడుగు..

సస్పెన్షన్‌కు గురైన ఆలయ ఉద్యోగి నుంచి బంగారు ఆభరణాలు దేవస్థానం ఆధీనంలోకి తీసుకోవడానికి సంబంధిత అధికారులు, ఇతర సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిణామాలపై బంగారు ఆభరణాల లెక్కలు చూపాల్సిందేనని పాలక మండలి పట్టుబడుతుంది. అదేవిధంగా ఆలయ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి. వాటి ఆదాయం, ఖర్చు, ఇలా అన్ని లెక్కలు పాలక మండలికి చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలస్యం చేయడం సరికాదు



ఆలయంలో ఆదాయంతో పాటుగా బంగారు ఆభరణాల లెక్కలను దేవస్థానం పాలకమండలి అడిగిన వెంటనే చూయించాలి. రికార్డులు ఉన్నప్పుడు లెక్కలు చూపడానికి అభ్యంతరం ఏమిటీ? ఆలస్యం చేయడం సరికాదు. – చిన్నకృష్ణయ్య, పాలక మండలి చైర్మన్

ప్రతి వివరాలు అందిస్తాం



ఆలయ పాలక మండలి అడిగిన ప్రతి వివరాలు ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంది. వారు అడిగిన వివరాలను అందిస్తాం. ఇటీవల నిర్వహించిన పాలకమండలి సమావేశంలో కూడా ఆలయానికి సంబంధించిన డీసీఆర్, అన్నదానసత్రం రికార్డులను చూయించాం. ఇంకా ఎలాంటి వివరాలు కావాలన్న చూయించేందుకు సిద్ధంగా ఉన్నాం. – పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

అడుగుతున్నాం..



ఆలయానికి సంబంధించి ఎంత ఆదాయం ఉంది. ఎంత మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వారి వేతనాలకు ఎంత ఖర్చు అవుతుంది. భూముల ద్వారా ఎంత గుత్త వస్తుంది. దేవదాయశాఖకు ఆలయం నుంచి ఎంత పన్నులు చెల్లిస్తున్నారు. ఇలా అన్ని అడిగాం. ఆలయ పాలక మండలి సభ్యుడిగా అడిగితే ఇలాంటి విషయాలు చెప్పడం లేదు. – సీ.వెంకటేష్, ఆలయ పాలకమండలి సభ్యుడు

అవగాహన కోసమే..



పాలక మండలి సభ్యులుగా నియమింపబడిన తాము ఆలయాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి భక్తులకు చక్కని వసతి కల్పించాలంటే ఆదాయం ఎంత, ఏమి చేయాలో తెలియాలి. ఆలయాల ఆదాయ వ్యవహారాలు తెలిస్తే ఎంత మేరకు అభివృద్ధి చేయగలమో మాకు అర్థమవుతుంది. అందుకు అవగాహన కోసం అన్ని వివరాలపై ఆరా తీస్తున్నాం. – వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త

కొండచిలువ పట్టివేత


పెబ్బేరు శివారులో పట్టుబడిన కొండచిలువ

పెబ్బేరురూరల్: పట్టణ శివారులోని రైతు ఆనంద్ వ్యవసాయ పొలంలో శుక్రవారం పెద్ద కొండచిలువను చూసి భయానికి గురై పట్టణానికి చెందిన వెంకటేష్‌కు సమాచారం అందించాడు. ఆయన స్నేక్ సొసైటీ సభ్యుడు, హోంగార్డు కృష్ణసాగర్‌కు ఫోన్ చేయడంతో వెంటనే తమ బృందంతో చేరుకొని అతి కష్టం మీద కొండచిలువను పట్టుకున్నారు. 10 ఫీట్ల పొడవు, 12 కేజీల బరువు ఉండడంతో పాటు రెండు కుందేళ్లను పట్టుకొని తిన్నట్లు గుర్తించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ.. వ్యవసాయ పొలాల్లో పాములు ఉండడం వల్ల రైతులు వేసుకున్న పంటలకు మేలు కలుగుతుందన్నారు. పాములు కనిపిస్తే చంపకుండా మాకు ఫోన్ చేయాలని, పాములపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి సూచన మేరకు కొండచిలువను శ్రీశైలం అడవిలో వదిలి వస్తామని తెలిపారు.

కొండచిలువ కలకలం

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో వరి పొలంలో కొండ చిలువ కనిపించడంతో కలకలం రేగింది. గ్రామానికి చెందిన రైతు మాల రమేష్ వ్యవసాయ పొలంలో వరి సాగు చేశాడు. గురువారం కూలీలు కలుపు తీస్తుండగా సాయంత్రం పొలంలో కొండచిలువ కనిపించడంతో కూలీలు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన గణేష్‌నాయుడును అక్కడికి పిలిపించారు. ఆయన వచ్చి పొలంలో ఉన్న కొండ చిలువను పట్టుకుని దాన్ని గాజులపేట అటవీ ప్రాంతంలో వదిలేశాడు. ఇదిలా ఉండగా అసలే చిరుత పులి సంచారంతో బిక్కుబిక్కుమంటు పొలాలకు వెళ్తుంటే ఇప్పుడు కొండ చిలువలు వస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఆలయ భూములపై విచారణ


ఆలయ భూములను పరిశీలిస్తున్న ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు

- కర్నూలులో గుట్టు చప్పుడు కాకుండా లీజుకు ఇచ్చిన వైనం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయానికి చెందిన కర్నూలు జిల్లా కేంద్రంలోని కల్లూరు మండలంలోని 15 ఎకరాల 35 గుంటల భూములను దేవస్థానంలోని కొందరు గుట్టు చప్పుడు కాకుండా పదేళ్లుగా లీజుకు ఇచ్చి అనుభవిస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆర్‌జేసీ రామకృష్ణ ఆదేశాల మేరకు దేవదాయశాఖలోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు విజయ్‌కుమార్, శ్రీనివాస్‌చారి శుక్రవారం భూములను పరిశీలించేందుకు కర్నూలు వచ్చారు. దేవస్థానం ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్, పాలక మండలి సభ్యులు వెంకటేష్, వెంకటనారాయణ, అడవప్ప, నీలప్ప, ఆనంద్ శర్మ కలిసి వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలమంతా బురదగా ఉండటంతో పూర్తి స్థాయిలో లోపలికి వెళ్లి పరిశీలించలేక పోయారు. సేద్యానికి అనువుగా భూమి చదును చేసి ఉండటాన్ని గమనించారు. అలాగే ఆలయ భూమిలో అన్యాక్రాంతంగా ఒక గుడిసె కట్టి ఉండటాన్ని వారు గుర్తించారు. దీనిపై ఆలయ కమిటీ, ఈఓ. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులకు పూర్వపరాలను తెలియజేశారు.

విలువైన భూములను ఉపయోగంలోకి తేవాలి: ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు

కర్నూలు జిల్లాలోని రూ.కోట్లు విలువ చేసే భూములను లీజుకు ఎందుకు ఇవ్వడం లేదని అధికారులు ప్రశ్నించగా ఈ భూములు సాగు చేసుకునేందుకు ఎవరు సాహసించడం లేదని ఆలయ అధికారులు చెప్పుకొచ్చారు. దీంతో ఈ భూములను అక్రమార్కుల బారి నుంచి కాపాడుకోలేక విక్రయించి ఆలయానికి సదరు మొత్తాన్ని ఎఫ్‌డీ చేద్దామని తగిన ధర రావడం లేదని ఆలయ ఈఓ చెప్పారు. దీంతో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు కర్నూలు సిటీలో ఉన్న ఈ భూమిని గోదాములు, కల్యాణ మండపాలు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి వాటికి లీజుకు ఇచ్చిన ఆలయానికి ఆదాయ వనరులు రావడంతో పాటుగా భూములను కాపాడుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే సింగవరంలోని భూములను కూడా వారు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: నిర్మల్‌లో శనివారం నుంచి ఈనెల 11 వరకు జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు జిల్లాకేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్ విద్యార్థి ప్రమిత ఎంపికైంది. శుక్రవారం పాఠశాలలో విద్యార్థినిని ప్రిన్సిపాల్ దత్తు, పీఈటీ విలియం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని కోరారు.

గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు

బల్మూర్: మండలంలోని కొండనాగుల సమీపంలో ఉన్న పెద్దగుడి బండ శివాలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేశారు. ఆలయం సమీపంలోని రైతు బాలరాజు గుర్తించి ఆలయ నిర్వాహకులకు శుక్రవారం ఉదయం తెలపడంతో వారు అక్కడికెళ్లి పరిశీలించారు. గర్భగుడి ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారం, కల్యాణవేదిక, ముఖ ద్వారాల వద్ద నిమ్మకాయలు, రక్తం, పసుపు, కుంకుమ, క్షుద్ర పూజల ఆనవాలు ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగకు రిమాండ్

మక్తల్: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంలాల్ తెలిపారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ కేంద్రంలో సంగంబండ రోడ్డు శ్రీసాయినగర్ కాలనీకి చెందిన కట్ట వీరేశకర్ ఇంట్లో ఆగస్టు 15న ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడింది అనంతపురం జిల్లా కల్మాణదుర్గం చెందిన పిట్ల గంగాధర్‌గా గుర్తించారు. నిందితుడిపై తెలంగాణ, కర్ణాటకలో 43 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఏకరువు


విద్యుత్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

రాజాపూర్: గ్రామాల్లో ఉన్న కరెంట్ సమస్యలను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పరిష్కరించడం లేదని వినియోదారులు ఆరోపించారు. సీజీఆర్ఎఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాజాపూర్ ఏడీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్ సెల్‌లో గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు చేశారు. రాజాపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ కారణంగా రెండు నెలల క్రితం గ్రామాల్లోని ఇళ్లలో ఫ్రిజ్‌లు, టీవీలు, కాలిపోయాయని దీంతో రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనా ఇప్పటి వరకు అక్కడ ఏర్పాటు చేయలేదని పంచాయతీ కార్యదర్శి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాయపల్లి శివారు రైతుల పొలాల్లో విద్యుత్ లూజ్ లైన్లు ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు లేవని రాయపల్లి రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. వినియోగదారుల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే సమావేశం నిర్వహించామని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ దిలీప్‌కుమార్ తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీజీఆర్ఎఫ్ మెంబర్ నాగేశ్వరరావు, మహబూబ్‌నగర్ డీఈ చంద్రమౌళి, జడ్చర్ల డీఈ కృష్ణమూర్తి, ఏడీ తౌర్యానాయక్, ఏఈ సుజాత, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 60 టికెట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న నాగేష్‌గౌడ్ తదితరులు

కల్వకుర్తి రూరల్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 60 ఎమ్మెల్యే సీట్లను బీసీలకు కేటాయించాలని బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నాళ్లు రాజకీయ వివక్ష కొనసాగిస్తారని ప్రశ్నించారు. 73 సంవత్సరాల భారత రాజ్యాంగ చట్టసభల్లో ఇంతవరకు ప్రాతినిధ్యం లేని కులాలు కేవలం బీసీలేనని అన్నారు. ఈ నెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించే బీసీల సింహఘర్జనను విజయవంతం చేయాలన్నారు. దశాబ్దాలుగా పాలకులు బీసీలను కేవలం ఓట్లు వేసే మరయంత్రాల మాదిరిగా చూశారు తప్పా.. బీసీల సంక్షేమం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకపై అది కుదరదని, 60 శాతం ఉన్న బీసీలకు సమాన స్థాయిలో పార్టీలు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రమేష్‌బాబు, సురేష్‌గౌడ్, రాంసాగర్, శివప్రసాద్, రవి, సురేందర, రవిసాగర్ పాల్గొన్నారు.



వాసవీ మాత.. ధగధగలు

శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రం బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా భక్తులచే సేకరించిన దాదాపు 20 కిలోల బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించామని పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చెప్పారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారిని వేలాది మంది దర్శించుకున్నారు. – స్టేషన్ మహబూబ్‌నగర్

వైభవంగా లోకాయపల్లి లక్ష్మమ్మ జాతర



దర్శనానికి పోటెత్తిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణపేట రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు సోమశేఖరస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవా, జల, ఫలచందన పుష్ప మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా మహిళలు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సమీపంలోని ఆంజనేయస్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటి సభ్యులు డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, లప్పఅశోక్, దినేష్‌లాహోటీ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు మరింత తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం 7 గంటల వరకు 25,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 20వేల క్యూసెక్కులకు తగ్గింది. ఆవిరిరూపంలో 95, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 23,780 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 117.207 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 242 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 25.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 8,814 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఈ ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్ ఫ్లోలు లేవని అధికారులు తెలిపారు.


జూరాల ఎడమ కాల్వ ద్వారా రామన్‌పాడుకు వెళ్తున్న నీరు

ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. శుక్రవారం 6 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద స్వల్పంగా చేరుతుండడంతో ఎగువలో 3 యూనిట్ల ద్వారా 117 మెగావాట్లు, 77.125 ఎం.యూ., దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, 82.601 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 159.726 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించారు.

640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలోకి శుక్రవారం 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా 573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

శ్రీశైలంలో 853.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 853.7 అడుగుల వద్ద, 88.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6 గంటల సమయంలో జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 23,045, సుంకేసుల నుంచి 6,610 మొత్తం 29,655 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,750, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,403, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,466 క్యూసెక్కుల నీటిని వదిలారు.

క్లుప్తంగా...

15న ఆ 9 చోట్ల భారీ ర్యాలీలు

కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం సందర్భంగా వేలాదిమందితో ప్రదర్శనలు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న ఏకకాలంలో తొమ్మిది జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో కనీసం 15వేల నుంచి 20వేల మందితో భారీ ర్యాలీలు నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 15న జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలలో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. సీఎం కేసీఆర్ 15న ఏదో ఒక చోట కొత్త మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కామారెడ్డిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు. దేశంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లను కలిగి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

ఎస్ఈసీగా పార్థసారథి పదవీకాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా సి.పార్థసారథి పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి శుక్రవారం (సెప్టెంబర్ 8)తో ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియడంతో, ఆ రోజు నుంచే మరో ఏడాది ఎస్ఈసీగా కొనసాగిస్తూ సుల్తానియా ఆదేశాలిచ్చారు.


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నరోత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభి వృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏర్పుల నరోత్తమ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి హరీశ్ నియామక ఉత్తర్వులను నరోత్తమ్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు.. నరోత్తమ్ ధన్యవాదాలు తెలిపారు.

రోగాలను బట్టి పీజీ మెడికల్ సీట్లు!

ఆయా ప్రాంతాల్లో సంబంధిత స్పెషాలిటీలో ఓపీ మేరకు సీట్లు మంజూరు

- ఔట్ పేషెంట్ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్ల కేటాయింపు
- వారానికి 20 ప్రసవాలున్న కాలేజీకి రెండు గైనిక్ స్పెషాలిటీ సీట్లు
- జాతీయ మెడికల్ కమిషన్ కీలక నిర్ణయం.. ముసాయిదా విడుదల
- ఎండీలో కొత్తగా ప్రజారోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్
- కొత్తగా అందుబాటులోకి 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు



సాక్షి, హైదరాబాద్: ఆయా ప్రాంతాల్లో వ్యాధులు.. రోగుల సంఖ్య..అందుతున్న వైద్య సేవలను బట్టి మెడికల్ కాలేజీలకు పీజీ సీట్లు కేటాయించాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. అంటే ఏ ప్రాంతంలో ఎలాంటి రోగాలున్నాయో, ఆయా ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలకు ఆయా స్పెషాలిటీల్లో పీజీ మెడికల్ సీట్లు వచ్చే అవకాశం ఉంటుందన్నమాట. ఈ మేరకు కొత్త పీజీ మెడికల్ ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం.. మెడికల్ కాలేజీలో సంబంధిత స్పెషాలిటీ వైద్యంలో ఔట్ పేషెంట్ (ఓపీ)ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటేనే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేస్తుంది. ఉదాహరణకు ఒక మెడికల్ కాలేజీకి రెండు పీడియాట్రిక్ సీట్లు కావాలంటే సంబంధిత కాలేజీలో రోజుకు చిన్న పిల్లల ఓపీ కనీసం 50 ఉండాలి. ఒక ఆపరేషన్ థియేటర్ 24 గంటలు పనిచేస్తేనే రెండు పీజీ అనస్తీషియా సీట్లు ఇస్తారు. వారానికి 20 ప్రసవాలు జరిగితేనే రెండు గైనిక్ సీట్లు ఇస్తారు. ఇక సంబంధిత స్పెషాలిటీలో అదనంగా మరో సీటు కావాలంటే 20 శాతం ఓపీ పెరగాలి. సూపర్ స్పెషాలిటీకి సంబంధించి రెండు సీట్లుకేటాయించాలంటే ఆయా సూపర్ స్పెషాలిటీ విభాగంలో రోజుకు 25 ఓపీ ఉండాలి.

పడకల్లో 75% ఆక్యుపెన్సీ ఉండాలి

ఎన్ఎంసీ మరికొన్ని కొత్త నిబంధనలను కూడా ముసాయిదాలో చేర్చింది. మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ పడకల్లో 75 శాతం ఆక్యుపెన్సీ ఉండాలి. అల్ట్రాసౌండ్‌లు రోజుకు 30 జరగాలి. 10 సీటీ స్కాన్లు చేయాలి. రోజుకు మూడు ఎంఆర్ఐ స్కాన్లు తీయాలి. రోజుకు 15 శాతం మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. గతంలో ఇలాంటి నిబంధనలు లేవు. సంబంధిత స్పెషాలిటీలో నిర్ణీత ఓపీ సంఖ్యతో సంబంధం లేకుండా మౌలిక సదుపాయాలు, సర్జరీలు, అన్ని రకాల ఓపీలు, ఐపీలు, బ్లడ్ బ్యాంకు నిర్వహణ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు ఉన్నాయా లేవా? వంటివి మాత్రమే చూసి సీట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రధానంగా ఓపీని ప్రామాణికంగా తీసుకొని ఇవ్వాలని నిర్ణయించారు.

ఐసీఎంఆర్ ఆన్‌లైన్ కోర్సులు చదవాలి

ఎండీలో కొత్తగా 3 కోర్సులను ఎన్ఎంసీ చేర్చింది. ప్రజా రోగ్యం , బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్‌లను ప్రవేశపెట్టింది. అలాగే సూపర్ స్పెషాలిటీలో ఉండే చిన్న పిల్లల గుండె, రక్తనాళాల కోర్సులను ఎత్తివేసి, సాధారణ గుండె, ఛాతీ, రక్తనాళాల సర్జరీలో చేర్చింది. సూపర్ స్పెషాలిటీలో ఉన్న ఛాతీ శస్త్రచికిత్స కోర్సును ఎత్తివేసి సాధారణ గుండె శస్త్రచికిత్సలో కలిపేసింది. అలాగే 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశ పెట్టింది. అవయవ మార్పిడి అనస్తీషియా, పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ, లేబొరేటరీ ఇమ్యునాలజీ, న్యూక్లియర్ నెఫ్రాలజీ, రీనాల్ పెథాలజీ, గ్యాస్ట్రో రేడియాలజీ, రక్తమార్పిడి థెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్, హిమటో ఆంకాలజీ, పీడియాట్రిక్ ఈ ఎన్‌టీ, స్పైన్ సర్జరీ కోర్సులు ప్రవేశపెట్టారు. పీజీ అయిపోయిన వా రు ఈ కోర్సులను చేసే సదుపాయం కల్పించారు. ఇక పీజీ చేసే ప్రతి విద్యార్థి మొదటి ఏడాది ఐసీఎంఆర్ నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరిగా చదవాలి. ఈ ముసాయిదాలోని అంశాలపై అభ్యంతరాలను 15వ తేదీలోగా తెలియజేయాలని ఎన్ఎంసీ కోరింది.

ఇలా అయితేనే ఉపయోగం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించాయి. అందువల్ల ఆయా మెడికల్ కాలేజీల్లో పీజీ మెడికల్ సీట్లను స్థానిక రోగాలను బట్టి కేటా యిస్తేనే ఉపయోగం ఉంటుంది. ఎన్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో శాస్త్రీయ మైనది. ఆయా ప్రాంతాల రోగులకు సంబంధిత వైద్యం అందుబాటులోకి వస్తుంది.

- డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

కేటీఆర్‌తో ఎమ్మెల్యే చెన్నమనేని భేటీ

సాక్షి, హైదరాబాద్: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ శుక్రవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. గత నెల 21న ప్రకటించిన బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో చెన్నమనేని రమేష్‌కు అవకాశం దక్కక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రధాన సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా, దుబాయ్ పర్యటన ముగించుకుని 20 రోజుల తర్వాత రాష్ట్రానికి తిరిగి వచ్చిన కేటీఆర్‌తో రమేష్ తాజాగా సచివాలయంలో భేటీ అయ్యారు. వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల అనుమతులు, కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులైన రమేష్‌కి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గురుతరమైన బాధ్యత అప్పగించిన కేటీఆర్‌తో పాటు సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా చెన్నమనేని ధన్యవాదాలు తెలిపారు.

సర్టిఫికెట్ల తనిఖీకి ప్రత్యేక సెంటర్!

- గురుకుల అభ్యర్థుల కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- 2 వారాలు కొనసాగేలా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువుల నియామకాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పా ట్లు చకచకా చేస్తోంది. ఇప్పటికే అర్హత పరీక్షలన్నీ నిర్వహించిన బోర్డు... మెజార్టీ సబ్జెక్టు లకు సంబంధించి తుది కీలను సైతం విడుదల చేసింది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేట గిరీలకు సంబంధించి కోర్టు పరిధిలో కేసులుండటంతో ఆయా పరీక్షల తుది కీలను ఇంకా ఖరారు చేయలేదు. ప్రస్తుతం ఫైనల్ కీలు ఖరారు చేసిన సబ్జెక్టులకు సంబంధించి మెరిట్ జాబితాలను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

9210 పోస్టుల భర్తీకి..

గురుకుల విద్యా సంస్థల్లో ప్రధానంగా 9 విభాగాల్లో 9210 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐ ఆర్‌బీ 9 రకాల ప్రకటనలు జారీ చేసింది. ఇందులో 61 సబ్జెక్టుల్లో ఈ పోస్టులున్నాయి. ఈ క్రమంలో ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేస్తూ మెరిట్ జాబితాలు విడుదల చేస్తారు. 1:2 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ సెంటర్‌కు హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. తొలుత జిల్లాల వారీగా పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉండడం... మరోవైపు రెండు వారాల పాటు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తుండడంతో హైదరాబాద్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే సరిపోతుందని బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. ఈమేరకు పరిశీలన కేంద్రం ఏర్పాటు, నిర్వహణపైన కసరత్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తేదీల ఎంపిక...

వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థి ముందుగా టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థికి అనుకూలంగా ఉన్న ఒక రోజును ఎంపిక చేసుకుని ఆమేరకు పరిశీలనకు హాజరు కావాలి. ఈనెల మూడో వారం నాటికి మెరిట్ జాబితాలు రెడీ చేసేలా బోర్డు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మెరిట్ జాబితాలు ఖరారైన తదుపరి వారంలోనే పరిశీలన ప్రక్రియ ప్రారంభించనుంది.

'ధిక్కరణ' వేయండి.. చర్యలు తీసుకుంటాం



వినాయక విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గతేడాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి హుస్సేన్‌సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారన్న ఆధారాలుంటే...ధిక్కరణ పిటిషన్ వేయాలని న్యాయవాది వేణుమాధవ్‌ను హైకోర్టు ఆదేశించింది. సరైన ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొలనుల్లో మాత్రమే పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్న మధ్యంతర ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నాయని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. పీఓపీతో తయారు చేసే విగ్రహాలపై నిషేధం ఎత్తివేయాలని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ ధూళ్‌పేటకు చెందిన తెలంగాణ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు హైకోర్టులో 2022లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయలేదని, తాత్కాలిక కొలనుల్లో చేశామని తెలిపారు. ఈ క్రమంలో న్యాయవాది వేణుమాధవ్ వాదిస్తూ.. కోర్టు ఆదేశాలున్నా పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, విచారణను వాయిదా వేసింది.

మేనేజ్‌మెంట్ వైద్య సీట్లకు మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వాస్త వంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒకసారి మాత్రమే చేసుకోవాలి. ఆ తర్వాత విడతల వారీగా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం తెలిపింది. పూర్తి వివరాలతో సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని వెల్లడించింది.

చేపల కోసం వెళ్తే.. మొసలి పిల్ల చిక్కింది!



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శ్రీనివాసకాలనీ సమీపంలోని పాలకొండ పెద్ద చెరువులో శుక్రవారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు తిరుపతయ్యకు ఓ మొసలి పిల్ల చిక్కింది. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తీసుకెళ్లిపోయారు. అనంతరం విలేకరులతో తిరుపతయ్య మాట్లాడుతూ 15 రోజుల క్రితం ఇదే చెరువు అలుగు వద్ద కొన్ని మొసలి పిల్లలు కనిపించాయన్నారు. ఇప్పుడు మరోసారి అక్కడికి వెళ్తే చేపలతో పాటు ఇది దొరికిందన్నారు. తాజా ఘటనతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. కాగా, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చెరువులోకి ఎవరూ వెళ్లవద్దని పాలకొండ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు తీగల ఆంజనేయులు కోరారు.

ఆర్టీసీలో పదోన్నతులు, బదిలీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఉద్యోగులకు పదోన్నతులు, రిక్వెస్టు బదిలీలు చేపట్టారు. రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి గురువారం 27 మంది డ్రైవర్లు, కండక్టర్లను ఏడీసీ–కంట్రోలర్లుగా పదోన్నతులు కల్పించారు. 20 మంది కండక్టర్లు, ఏడుగురు డ్రైవర్లు పదోన్నతులు పొందారు. అదేవిధంగా వివిధ డిపోల్లో పని చేస్తున్న 13 మంది ఏడీసీ కంట్రోలర్లను వారి అభ్యర్థన మేరకు బదిలీలు చేశారు. ఈ పదోన్నతులు, బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆర్ఎం తెలిపారు.

'చేనేత' సమావేశాలు నిర్వహించండి

అమరచింత: చేనేత, ఉన్ని సహకార సంఘాల సమావేశాలు నిర్వహించి కొత్త సభ్యత్వాల నమోదుపై చర్చించి నివేదికను త్వరగా కార్యాలయానికి అందజేయాలని చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య శుక్రవారం తెలిపారు. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల సంఘాల అధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్లు చొరవ చూపాలని, నివేదికను ఈ నెల 25 నాటికి అందజేయాలని కోరారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా



మాట్లాడుతున్న డీఐజీ చౌహాన్

- ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- డీఐజీ ఎల్ఎస్.చౌహాన్
- గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ ఎస్పీలతో సమావేశం

గద్వాల క్రైం: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుశాఖ మూడు రాష్ట్రాల సరిహద్దుల వద్ద పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందిగా జోగుళాంబ గద్వాల జోన్–7 డీఐజీ ఎల్ ఎస్.చౌహాన్ అన్నారు. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాతో పాటు, నారాయణపేట, నాగర్‌కర్నూల్ ఎస్పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్ణాటక రాష్ట్రం నుంచి అనుమతి లేకుండా మద్యం , నగదును తరలించేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక సరిహద్దులలో 11 చెక్ పోస్టులను గుర్తించామన్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అనంతరం అనుమతి ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించొద్దని ఆదేశించారు. మూడు రాష్ట్రాల సిబ్బంది పరస్పర సహాయ సహకారాలతో అనుమతి లేని రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్పీలు సృజన, వెంకటేశ్వర్లు, మనోహర్, ఏఎస్పీ రవి, ఆయా రాష్ట్రాల సిబ్బంది సత్యనారాయణ, అస్లాంబాషా, బసవేశ్వర్ తదితరులు ఉన్నారు.

పోలీస్‌కి క్రమశిక్షణ ఎంతో అవసరం

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ విధి నిర్వహణలో నిజాయితీ చాలా ముఖ్యమని కొత్తగా శిక్షణకు వెళ్తున్న సివిల్ ఎస్ఐలు విధుల పట్ల మరింత బాధ్యతగా ఉండాలని గద్వాల జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నూతనంగా ఎంపిక అయిన 26మంది సివిల్ ఎస్ఐలకు ఐడీ కార్డుల జారీతో పాటు శిక్షణకు వెళ్తున్న క్రమంలో శుక్రవారం డీఐజీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పోలీస్ ఉద్యోగం సాధించిన తర్వాత విధుల్లో ఉన్న వారిని ప్రతి ఒక్కరూ గమనిస్తుంటారన్నారు. పోలీస్ శాఖలో ప్రవర్తన, క్రమశిక్షణ, చురుకుదనం, నాయకత్వ లక్షణాలు చాలా ముఖ్యమన్నారు. ఒక స్టేషన్‌ను సరైన మార్గంలో నడిపించాలంటే ఎస్ఐలకు నాయకత్వ లక్షణాలు చాలా ఉపయోగపడుతాయని తెలిపారు. ఎంతో బాధ్యతతో ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకుని రావాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ కె.నరసింహ పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ జోగుళాంబ గద్వాల జోన్–7 డీఐజీ ఎల్. ఎస్ చౌహాన్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లాపూర్ స్టేషన్‌లో రెండవ ఎస్ఐగా పని చేస్తున్న బోయ శివనాగేశ్వర్‌నాయుడిని మిడ్జిల్ ఎస్ఐగా బదిలీ చేయగా, మిడ్జిల్ ఎస్ఐగా పని చేస్తున్న ఏ.రామ్‌లాల్‌ను మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



నెట్‌బాల్ జట్లకు ఎంపికైన బాలికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మైనార్టీ గురుకులాల విజిలెన్స్ అధికారులు జమీర్‌ఖాన్, ఆలం అన్నారు. నిర్మల్‌లో శనివారం నుంచి ఈనెల 11 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల–1, 2, 3 గురుకులాల విద్యార్థినులు ఉమ్మడి జిల్లాలోని పలు జిల్లాల జట్లకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బాలికల గురుకులాల సముదాయంలో అధికారులు విద్యార్థినులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాల్స్ లక్ష్మి, శ్రీదేవి, సురేఖ, పీఈటీలు కృష్ణవేణి, పర్వీన్, రాణి తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

పూజ, తారక, సౌమ్య, సిద్ధిని, సానియా, సమీర, సన, మాధవి, జయశ్రీ, అయేషా, భాను, మాహీన్, ఆఫ్రిన్, తైఫా, యాస్మిన్, సమ్రీన్, ఆఫ్రిన్, ఆసియా, సాహేరా, నిషాత్, సల్మా, సాహేరా, పూజిత, అనిత, శ్రీహర్షిత, అంబిక, ఆకాంక్ష, డి.రోహిణి, నఫీసా, తస్లిం, సనామెహరాజ్, ఎస్‌కె.తస్లీం.

ఫుట్‌బాల్ ఎంపికలకు 210 మంది హాజరు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తి: జిల్లా కేంద్రంలోని బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో శుక్రవారం అండర్ – 14, 17 బాలబాలికల జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడాల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ హాజరై ఎంపికలు ప్రారంభించారు. ఫుట్‌బాల్ ఎంపికలు విజయవంతంగా పూర్తయ్యాయని, జిల్లా నలుమూలల నుంచి 210మంది హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, జీహెచ్ఎం చంద్రశేఖర్, శ్రీనివాసులు, పీడీ, పీఈటీలు శ్రీనివాసులు, కుమార్, ఖీజర్, తిరుపతయ్య, రాజేందర్, శ్రీకాంత్, షబ్బీర్, కమలాకర్, స్వామి, ఎర్రన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని మహిళా ప్రయాణికుల కోసం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ లక్కీడ్రాలో ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటమ్మ (పర్సాపూర్– కొడంగల్)కు రూ.25 వేలు, ద్వితీయ ఎం.కవిత (కొల్లంపల్లి– నారాయణపేట)కు రూ.15 వేలు, తృతీయ ఖైరున్నీసా (బలిజపల్లి– పెద్దమందడి)కి రూ.10 వేల నగదు బహుమతులను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ అందజేశారు. అలాగే విజేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా మహబూబ్‌నగర్, జడ్చర్ల బస్టాండ్లలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్ సుజాత తదితరులు వీక్షించారు.

- స్టేషన్ మహబూబ్‌నగర్

'పాలమూరు ప్రాజెక్టు చిన్నాభిన్నం'

- 13 రోజుల్లో వెట్ రన్ చేస్తే సాంకేతిక సమస్యలు
- ఏదుల రిజర్వాయర్‌తో వనపర్తికి చుక్క నీరు రాదు
- ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి: జూరాల ఆధారంగా ఉన్న ప్రాజెక్టును ఒక వ్యక్తి కోసం శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా తీసుకుని ప్రాజెక్టులో లేని నల్లగొండను చేర్చి, పాలమూరు– రంగారెడ్డిని సీఎం కేసీఆర్ చిన్నాభిన్నం చేశారని ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి మండిపడ్డారు. సీడబ్ల్యూసీకి వస్తున్న ఆదరణ, సీఎం వ్యక్తిగత స్వలాభం కోసం ఆదరబాదరగా పాలమూరు వెట్ రన్ చేసేందుకు 16న వస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా దీన్ని ప్రశ్నించాలన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. డ్రై రన్ చేశాకా 32 రోజుల తర్వాత వెట్‌రన్ చేయాలని, లేదంటే టెక్నికల్ సమస్యలు తలెత్తుతాయని తెలిసినా వెట్ రన్‌కు పూనుకోవడం సరైందికాదన్నారు. మన ప్రాంతంలో ఎత్తైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కట్టలేదని, లక్ష్మీదేవిపల్లి కట్టకుంటే రంగారెడ్డి జిల్లాకు నీళ్లు ఎలా వెళ్తాయన్నారు. నార్లాపూర్ 9 పంపులు పెట్టాల్సిన చోట ఒక్క పంపు పెట్టి ఆ పనులు ఇంకా పూర్తి కాకుండానే 13 రోజుల వ్యవధిలోనే వెట్ రన్ ఎలా చేస్తారని, మిగతా పంపులు ఎప్పుడు పెడతారని నిలదీశారు. ఏదుల రిజర్వాయర్‌తో కెనాల్ పెట్టి నల్లగొండకు నీళ్లు తీసుకెళ్లేందుకు కట్టారని అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టుకు నీళ్లు ఇస్తారో నేటికి చెప్పడం లేదని, మెదక్, సిద్దిపేట, సిరిసిల్లకే పరిమితం చేసి రూ.లక్ష కోట్లు లూటీ చేశారని విమర్శించారు. ఉద్దండాపూర్ తర్వాత సర్వే కాకుండా పనులు మొదలు పెట్టారని దుయ్యబట్టారు. వట్టెం, ఏదుల, స్పేర్‌తో 9 పంపులు పెట్టి ఉద్దండాపూర్ వద్ద 5 పంపులు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ఏదుల సర్జిపుల్ ప్రపంచంలో ఎక్కడా లేదనడం మంత్రి నిరంజన్‌రెడ్డి మిడిమిడి జ్ఞానానికి నిదర్శనమన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి వనపర్తికి ఒక్క చుక్క నీళ్లయినా ఇస్తారా? అని ప్రజలు మంత్రిని అడగాలని పిలుపునిచ్చారు. ఏదుల రిజర్వాయర్‌తో వనపర్తికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. నార్లాపూర్ వద్ద ఎత్తిపోసి, ఏదులకు అక్కడ ఎత్తిపోస్తే వట్టెంకు, ఆ తర్వాత కర్వెనకు గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయన్నారు. ఏదుల, నార్లాపూర్ కింద ఒక్క ఆయకట్టు లేదని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ చేపట్టకుంటే రంగారెడ్డికి నీళ్లు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరో ఫేజ్ కింద జూరాల ఆధారంగా పాలమూరు ప్రాజెక్టును చేపడతామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, విజయ్‌చందర్, కిరణ్‌కుమార్, ఖమర్‌మియ్యా, బాబా తదితరులు పాల్గొన్నారు.